# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ మాసపత్రిక

JULY 2007

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్టా ఛానల్ లో ఉదయం 7:00 గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం 7:00గం॥లకు,సాయంత్రం 5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH


P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | జూలై 2007 | సంచిక 12


## దేవుడు సర్వశక్తిమంతుడు

(God is Omnipotent)

దేవుడు సర్వశక్తిమంతుడు అని బైబిలు బోధించుచున్నది. అంటే ఆయన అమితమైన శక్తిగలవాడని యర్థము. యెహోవా అబ్రాహాముకు ప్రత్యక్షమై “నేను సర్వశక్తి గల దేవుడను; నా సన్నిధిలో నడుచుచు నిందా రహితుడవై యుండుము” అని చెప్పెను (ఆది.కా. 17:1). “యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా ఉన్నదా?” యనే ప్రశ్న ఆది.కా. 18:14లో వేయబడింది. “నీవు సమస్తమును చేయగలవనియు, నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటినని” భక్తుడైన యోబు యెహోవా దేవుని కొనియాడెను (యోబు 42:1). “సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు; ఆయనను స్తుతించుడి” యని ప్రకటన 19:7లో వ్రాయబడి యున్నది. దేవునికి సమస్తమును సాధ్యమేయని యేసు ప్రభువు చెప్పెను(మత్తయి 19:26)

దేవుని గ్రంథమైన బైబిలు చెప్పు సంగతులు యదార్థము. దేవుడు సర్వశక్తిమంతుడు. ఆయన చేయలేనిది ఏదీలేదు. అయితే ఆయన సర్వశక్తిమంతుడైనను తన శక్తిని తానే అదుపులో యుంచుకొనగలడు. నిజానికి మానవులందరినీ మరమనిషిలాగ చేసే శక్తి ఆయనకున్నది. అట్లు చేస్తే మానవులందరు ఆయన మాటలకే లోబడతారు, అందరు మంచినే చేస్తారు. అయితే ఆయన అట్లు చేయుటకు నిశ్చయించుకొనడు. ఒకని చేతిలో శక్తియున్నంత మాత్రాన అతడు దాన్ని వినియోగించుకొనుటకు నిశ్చయించుకొనకపోవచ్చును. ఉదాహరణకు కొన్ని అభివృద్ధి జెందిన దేశాలో ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు ఉన్నాయి. వాటిని ప్రయోగిస్తే మానవాళిలో సంగంమంది నాశనమవుతారు. గాని వారు వాటిని ఉపయోగించరు. దేవుడు కూడ అట్లే. మనందరినీ పాపమును బట్టి నాశనం చేసే శక్తి ఆయనకున్నది. గాని ఆయన మనలను నాశనం చేయుటకు లేదు. మనం మారుమనస్సు పొందాలని ఆయన కాంక్షించు చున్నారు.

ఈ లోకంలో జరుగుచున్న అన్యాయాలను, అక్రమాలను దేవుడు అరికట్టుట లేదు గనుక దేవుడు లేడని కొందరు భావిస్తారు. నిజానికి ఈ లోకంలో యున్న అన్యాయాలు, అక్రమాల నిత్యమూ కొనసాగుచుయుంటే దేవుడు లేడని భావించుట సమంజసమే. అయితే దేవుడు ఒకానొక దినమున ఈ లోకాన్ని,దానిలోని దుష్టత్వాన్ని నాశనం చేసేస్తాడని బైబిలు చెప్పుచున్నది. "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును" (2 పేతురు 3:10). యేసు క్రీస్తు తన శత్రువులందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము అని 1కొరింధీ 15:26లో వ్రాయబడి యున్నది. యిది జరిగినపుడు రోగములు, దుఃఖము,మరణము, దౌష్ట్యము లేని పరలోకంలో మనం నివసింతుము.

## ప్రేమలో శక్తి

దేవుడు ఇప్పుడు తన ప్రేమశక్తిని వినియోగించుచున్నాడు. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను (యోహాను 3:16). ఆయన సువార్త శక్తిని వినియోగించి మనుష్యులను మార్చుచున్నాడు. యేసుక్రీస్తు సువార్తను నమ్ము ప్రతివానిని రక్షించుటకును, సత్పురుషునిగా చేయుటకును దేవుడు దానిని శక్తిగా చేసియున్నాడు (రోమా 1:16). ఈ రీతిగా మానవులు క్రీస్తు నామమును ఒప్పుకొని ఆయనను ఘనపరచాలని కోరుచున్నాడు. అయితే ఇప్పుడు మానవులు క్రీస్తును ఒప్పుకొనకపోతే ఒకానొక దినమందు తన ప్రభావము వలన వారందరు ఆయనను ఒప్పుకొనునట్లు చేయును. ఒకానొక దినమందు ప్రతివాని మోకాలును యేసు నామమున వంగుననియు, ప్రతివాని నాలుకయు ఆయనను ఒప్పుకొనుననియు బైబిలు చెప్పుచున్నది.

"ఇహమందును, పరమందును నాకు సర్వాధికార మీయబడియున్నది" యని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 28:18). "మరణము యొక్కయు, పాతాళ లోకము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో యున్నవి" యని ఆయన చెప్పారు. (ప్రక 1:18). ఆయన భూపతులకు అధిపతియని ప్రకటన 1:5లో చెప్పబడినది. దేవుడు సర్వాధికారియు, సర్వశక్తిమంతుడునై యున్నాడు.

సృష్టిలో దేవుని యొక్క సర్వశక్తి మానవునికి మొదట బయలుపరచబడినది. "ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు" హెబ్రీ 11:3లో వ్రాయబడియున్నది. దేవుడు ఆదిలో తనమాట చేత సమస్తమును కలుగజేసెను. ఆయన ఫలానాది కలుగును గాక యని పలుకగా అది అట్లు కలిగెను. దేవుడు భూమ్యాకాశములను, వాటిలోని సమస్తమును తనమాట చేత కలుగజేసెను. "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలమంచిదిగ నుండెను" (ఆది 1:31).

## వాక్యములో శక్తి

దేవుని వాక్యములో ఎంతశక్తి యున్నదంటే ఆయన మాట సెలవియ్యగా సమస్తమును కలిగెను. ఆయన మాట చొప్పుననే సమస్తమును కలుగుచున్నది. దేవుని వాక్యము అగ్నివంటిది. సుత్తెవంటిదియని బైబిలు చెప్పుచున్నది. "నా మాట అగ్నివంటిది కాదా? బండలను బద్దలు చేయు సుత్తెవంటిది కాదా? యిదే యెహోవా వాక్కు అని యిర్మియా 23:29లో వ్రాయబడియున్నది. అంతేకాదు, "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించు నంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12).

## సృష్టిలో శక్తి

దేవుని మాట వలన భూమి, ఆకాశముసూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు కలిగెను, బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధచేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటి కొలనూలు భూమి యందంతట వ్యాపించియున్నది. లోక దిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలువెళ్లుచున్నవి. వాటిలో ఆయన సూర్యునికి గుడారము వేసెను" (కీర్తన 19:1-4).

"ఆయున అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి" యని రోమా 1:20లో వ్రాయబడియున్నది. దేవుని ఉనికిని గూర్చి మనం తెలిసికోవాలంటే ప్రకృతిని ఒకమారు పరిశీలించితే చాలు. అదే ఆయనను గూర్చి, ఆయన నిత్యశక్తిని గూర్చి ప్రచురము చేయుచున్నది.

ప్రకృతి అంతా దేవుని సర్వశక్తిని గూర్చి ఒక ప్రక్కన ప్రచురము చేయుచుంటే, మరొక ప్రక్కన మానవుడే

దేవుని నిత్యశక్తికి ఉదాహరణగా యున్నాడు. దావీదు మహారాజు పరిశుద్ధాత్మ ప్రేరణ కలిగి ఇట్లు వ్రాసాడు: "నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించిన వాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" (కీర్తన 139:13,14).

దేవుడు ఈ విశ్వాన్ని చేసారు. గాని అంతకంటే గొప్పగా ఆయన మానవుని సృజించి అతనిలో తన జీవాత్మను ఉంచియున్నారు. మరియు మానవుని ద్వారా ఆయన అనేక గొప్ప కార్యములను నేటికిని జరిగించుచున్నారు. యేసుక్రీస్తు యొక్క సువార్త ద్వారా ఆయన మానవుని ఉన్నత భావములు గల వ్యక్తిగా మార్చుచున్నారు. "యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము. జ్ఞానము గలవానికి ఉపదేశము చేయగా వాడు మరింత జ్ఞానము నొందును. యెహోవా యందు భయభక్తులు కలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము. పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము" (సామె 9:9-10).

పరిశుద్ధ దేవుని గూర్చిన జ్ఞానము మానవునిలో వికసించినప్పుడు కుటుంబంలో సంతోషముండును, పంటలు సమృద్ధిగా పండును. దేశపౌరులు నమ్మకముగా యుందురు. ఆహారము సమృద్ధిగా యుండును, కళలు సంస్కృతి సంగీతము వికసించును, విద్య ఉన్నత స్థాయికి చేరుకొనును ప్రభుత్వాలలో నీతియేలును. దేవుని ఎరిగి వారు విధరాండ్రను, అనాథలను, అభాగ్యులను ఆదరించుదురు. యిదంతా ఎట్లు జరుగును? ఎవరైనా తెచ్చి పెట్టిన ఒత్తిడి వలననా? కానేకాదు. మంచి వలన మనలో మంచితనము ఉద్భవిస్తాది. కృప మనలను దయాదాక్షిణ్యము గలవారిగ తయారుచేస్తాది. పరిశుద్ధత పవిత్ర ఆదర్శములను మనకు నేర్పుతాది. సత్యము వలన నీతి న్యాయములు నెలకొల్పబడతాయి. ప్రేమ వలన బంధ

హృదయాలు నయితము బ్రద్దలవుతాయి. ఆనందదాయకమైన సమాజములుద్భవిస్తాయి.

ఇదంతా ఎట్లు సంభవిస్తాది? దేవుని వాక్యములోని శక్తివలన! అందుకే దావీదు మహారాజు ఇట్లనుచున్నాడు: యెహోవా "నీ ఉపదేశము వలన నాకు వివేకము కలిగెను; తప్పుమార్గము లన్నియు నా కహస్యము లాయెను. నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది". "నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అవి తెలివి లేనివారికి తెలివి కలిగించును" (కీర్తన 119:104,105;130). దేవుడు సర్వశక్తిమంతుడు. ఆయన వాక్యము సర్వశక్తి గలవాక్యము. అది నిన్ను నన్ను ఆయన కొరకు మార్చును !!

## సంఘ ప్రభువు రాత్రి భోజనము
## (Supper of the Church)

క్రీస్తుయొక్క జన్మదినమును జ్ఞాపక ముంచుకొనుడియని గాని లేక ఆయన మరణ, పునరుత్థానములను సంవత్సరమున కొకసారి ఆచరించుడి యనిగాని దేవుని ప్రజలు ఆజ్ఞాపింపబడ లేదు. సంఘమంతయుగాని, లేక వ్యకి గత క్రైస్తవుడుగాని మతసంబంధమైన పండుగలను ఆచరించవలెనని ఎన్నడు కోరబడలేదు. క్రైస్తవులకు జ్ఞాపకార్థముగ ఈయబడిన సంస్థ లేక "పండుగ" ఒకే ఒక్కటి యున్నది. అది ప్రభువురాత్రి భోజనము.

ప్రభువురాత్రి భోజనము అనగా నేమి?దాని నెవరు నెలకొల్పిరి? దాని ప్రయోజన మేమిటి? దానిలో పాలు పంచుకొనుటకు క్రైస్తవులకు ఒక ప్రత్యేక నమయము ఈయబడెనా? ఈ పాఠములో ఈ ప్రశ్నలకును,మరి కొన్నింటికిని జవాబును కనుగొందము.

ప్రభువురాత్రి భోజనమును క్రీస్తే నెలకొల్పెను. దాని విషయమై సంపూర్తిగ తెలిసికొనుటకు లేఖనములను ఇప్పుడు చదువుదము: పులియని రొట్టెల పండుగలో మొదటి దినమందు

శిష్యులు యేసునొద్దకు వచ్చి పస్కాను భుజించుటకు మేము నీకొరకు ఎక్కడ సిద్ధపరచ గోరుచున్నావని అడిగిరి. అందుకు కాయన మీరు పట్టణమందున్న ఫలాని మనుష్యుని యొద్దకు వెళ్ళినా కాలము సమీపమై యున్నది; నా శిష్యులతో కూడ నీయింట పస్కాను ఆచరించెదని బోధకుడు చెప్పుచున్నాడని అతనితో చెప్పుడనెను. యేసు తమ కాజ్ఞాపించిన ప్రకారము శిష్యులుచేసి పస్కాను సిద్ధపరచిరి. సాయంకాలమైనప్పుడు ఆయన పండ్రెండు మంది శిష్యులతో కూడ భోజనమునకు కూర్చుండెను. వారు భోజనము చేయచుండగా ఆయన- మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు వారు బహుదుఃఖపడి ప్రతివాడును-ప్రభువా, నేనా? అని ఆయన నడుగగా ఆయన-నాతో కూడ పాత్రలో చెయ్యి ముంచిన వాడెవడో వాడే నన్ను అప్పగించువాడు. మనుష్య కుమారుని గూర్చి వ్రాయబడిన ప్రకారము ఆయన పోవుచున్నాడు గాని యెవని చేత మనుష్య కుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ; ఆ మనుష్యుడు పుట్టి యుండని యెడల వానికి మేలని చెప్పెను. ఆయనను అప్పగించిన యూదా, బోధకుడా నేనా? అని అడుగగా ఆయన-నీవన్నట్టే అనెను.

వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి-మీరు తీసికొని,తినుడి; ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి-దీని లోనిది మీరందరు త్రాగుడి, ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము. నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు ఇకను దానిని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను. అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్ళిరి (మత్తయి 26:17-30).

కొరింధులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు చెప్పెను: ''మనము దీవించు

ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయేగదా? మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయేగదా? మన మందరము అయొకే రొట్టెలో పాలు పుచ్చుకొనుచున్నాము: రొట్టెయొక్కటే గనుక అనేకులమైన మనము ఒక్కశరీరమైయున్నాము" (1కొరింధి10:16-17). విగ్రహములను, ప్రభువును ఒకేసారి కొందరు ఆరాధించుటకు ప్రయత్నించునట్టి విగ్రహారాధికుల కాలములో జీవించుచు పౌలు ఇట్లునెను: "మీరు ప్రభువు పాత్రలోనిది దయ్యముల పాత్రలోనిది కూడ త్రాగనేరరు; ప్రభువు బల్లమీద ఉన్నదానిలోను, దయ్యముల బల్లమీద ఉన్నదానిలోను కూడ పాలు పొందనేరరు" (1కొరింధి10:21).

పౌలు మరల కొరింధీయులకు ఇట్లు వ్రాసెను: "నేను మీకు అప్పగించిన దానిని ప్రభువువలన పొందితిని. ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను ఎత్తికొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, దానిని విరిచి-యిది మీకొరకైన నాశరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను ఎత్తుకొని-యీపాత్ర నా రక్తమువలనైన క్రొత్తనిబంధన; మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను. మీరు యీరొట్టెనుతిని, యీ పాత్రలోనిది త్రాగునపుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు. కాబట్టి ఎవడు అయోగ్యముగా ప్రభువుయొక్క రొట్టెను తిననో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువుయొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధియగును. కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొన వలెను; ఆలాగు చేసి ఆరొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను. ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు"(1కొరింధి11:23-29). పైన చెప్పబడిన ఈవచనముల నుండి మనము ఈదిగువ సంగతులను గ్రహించుకొనగలము.

1. యేసుప్రభువు రాత్రిభోజనమును స్థాపించి, దానిలో మనము పాలు పుచ్చుకొనుచుండగా మనతో యుందునని వాగ్దానము చేసెను.

2. రొట్టెను క్రీస్తు శరీరమునకు గురుతుగా భుజింపవలెను. అది క్రీస్తుయొక్క నిజశరీరము కాదు. అది క్రీస్తుశరీర మాంసముగా మారదు. గాని అది సూక్ష్మముగా క్రీస్తు శరీరమునకు గురుతుగా, అంటే జ్ఞాపకార్థముగా ఈయబడెను. రొట్టె మాత్రము పులియని రొట్టె అయ్యుండును. లోకమంతటా ఇది సులభముగా లభించును.

3. ద్రాక్షారసమును క్రీస్తు రక్తమునకు గురుతుగా సేవింపవలెను. అది నిజమైన రక్తముకాదు. అది రక్తముగా మారదు గాని మనకొరకై చిందింపబడిన క్రీస్తు రక్తమునకు గురుతుగా అది యున్నది: క్రీస్తు రక్తమును మన జ్ఞాపకమునకు అది తెచ్చును. ద్రాక్షారసము లోకమందంతటా దొరకును. దానిని సంపాదించుట కష్టము కాదు.

4. మానవుడు త్వరితముగా మరచిపోయే గుణముగలవాడని క్రీస్తు యెరుగును. అందువలన ఈ లోక పాపముల నిమిత్తమై జరిగించబడిన బలిని అతడు జ్ఞాపకముంచుకొను నిమిత్తము ఆయన ప్రభువురాత్రి భోజనము నిచ్చెను.

5. దానిలో పాలు పుచ్చుకొనుట ద్వారా మనము క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానములను నమ్ముచున్నామనియు ఆయన మరల రాబోవుచున్నాడనియు లోకమునకు తెలియజేయుదుము.

6. ప్రతివాడును క్రైస్తవుడుగా ఉండవలసిన రీతిగా తాను యున్నాడో లేదో పరీక్షించుకొను సమయము ప్రభువురాత్రి భోజనము, దానిలో యెవరు పాలుపుచ్చుకొనవలెనో, ఎవరు పాలు పుచ్చుకొనకూడదో నేను చెప్పజాలను. నేను గనుక నమ్మకమైన క్రైస్తవుడను కానియెడల దానిలో పాలు పుచ్చుకొనక ముందు నా దోషమును సరిదిద్దుకొనవలెను. దానిలో పాలు పుచ్చుకొనక ముందు నేను పాపము లేనివాడుగ యుండవలెనని ప్రభువు కోరుచున్నట్లు దీని ఉద్దేశము కాదు గాని నేను ఆయనకు నమ్మకముగా యుండవలెనని ఆయన యుద్దేశమై యున్నది. నమ్మకముగా

యుండవలెనంటే ఆయన ఆజ్ఞాపించిన రీతిగ దానిలో నేను పాలు పుచ్చుకొనవలెను. నేనట్లు చేయకను, లేక దానిని అయోగ్యముగా చేసినను నా ఆత్మ నాశనముకొరకు నన్ను నేనే దానిని తిని ఆ పాత్రలోనిది త్రాగిన యట్లగును.

7. మనము ప్రభువు పాత్రలోనిది, దయ్యముల పాత్రలోనిది కూడ త్రాగనేరమనియు, ప్రభువు బల్లమీద ఉన్న దానిలోను, దయ్యముల బల్లమీద ఉన్న దానిలోనుకూడ పాలు పొందలేమనియు పౌలు చూపించెను. క్రైస్తవుడు ప్రభువురాత్రి భోజనము దేవునికి అంగీకారయోగ్యముగా చేయవలెనన్న అతడు విగ్రహారాధన నుండియు అబద్ధ బోధల నుండియు తన్ను తాను ప్రత్యేకించుకొనవలెనని దీని యర్థము. ప్రభువురాత్రి భోజనమును వారు సామాన్య భోజనముగా ఎంచరాదని కొరింథులోని క్రైస్తవులకు జ్ఞాపకము చేయబడెను. సరిగదా వారు తమతమ భోజనపానాదులను తమ యిండ్ల వద్ద జరిపించి, ప్రభువురాత్రి భోజనమును భక్తిపూర్వకముగా ఆచరించవలెనని హెచ్చరింపబడిరి. అయితే ఈ భోజనమును ఎప్పుడు జరిగించవలెను? దానిని మన యిష్టము వచ్చిన సమయములో అనుసరించ వచ్చునా? కొందరు నెల కొకసారి మరికొందరు సంవత్సరమున కొకసారి ఆచరించెదరని మన మెరుగుదుము. అయితే లేఖనములు ఏమి బోధించుచున్నవి? క్రీస్తు ఆదివారమున పునరుత్థానుడయ్యెనని దేవుని వాక్యము బోధించుచున్నది. ఆయన తన శిష్యులకు ఒకటికంటె ఎక్కువ మారులు ఆదివారమున కనబడెననియు, సంఘము పెంతెకొస్తు దినమున అనగా ఆదివారపు దినమున స్థాపించబడెననియు లేఖనములు బోధించుచున్నవి. ఇది నిజముగా ప్రాముఖ్యమైనది. త్రోయలో యున్న క్రైస్తవులతో కలసి ఆదివారమునాడు ఆరాధించుటకు అక్కడ ఒక వారము దినములు పౌలు గడిపెను. లేఖనములలో ఇట్లు వ్రాయబడి యున్నది: "ఆదివారమున మేము రొట్టెవిరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి, వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను"

(అపొ.కా.20:7). ఆది వారమున క్రీస్తు శిష్యులు రొట్టె విరుచుటకు ప్రత్యేకముగా కూడుకొనిరనియు, ఆ సందర్భముగా పౌలు వారికి ప్రసంగించెననియు దయచేసి గమనించుము. అయితే ఈ వచనములో "ప్రతి ఆదివారమునాడు" అని చెప్పబడుటలేదని కొందరు అందురు. అట్లయిన ధర్మ శాస్త్ర ప్రకారము ప్రజలు "ప్రతి సబ్బాతును" ఆచరించవలెనని దేవుడు చెప్పలేదు. గాని వారు ప్రతి సబ్బాతు దినమును ఆచరించవలెనని వారెరుగుదురు. అట్లే ప్రతివారములోను ఒకేఒక్క ఆదివారమున్నది. అందు వలన క్రైస్తవులు దేవుని నారాధించు నిమిత్తము, ఆరాధనలో ఒక భాగమైన ప్రభువు రాత్రి భోజనము ఆచరించునిమిత్తము ప్రతి ఆదివారమున కూడుకొందురు. అట్లు కాదని చెప్పుటకు అధికారము ఎవరికి ఉన్నది? ఆదివారము నుండి ప్రభువు రాత్రి భోజనమును తొలగించు నిమిత్తము వారు ఏ వాక్య భాగమును చూపింతురు?

మన కాలములో ప్రభువురాత్రి భోజనము ఒక గొప్ప స్మారక చిహ్నమైయున్నది. క్రీస్తును ఆయన సంఘమును సమకూర్చునది అది.సంఘమును సజీవముగా యుంచి తద్వారా క్రీస్తును ఈ లోకమునకు ప్రకటించు ఒక మార్గమది. మన మనస్సులను క్రీస్తుపై కేంద్రికరించుచు అది మనలను ఐక్యపరచును. అందువలన మనము ప్రభువురాత్రి భోజనములో పాలు పంచుకొను నిమిత్తము ఆదివారమున కూడుకొందుము. అందువలననే సంఘమునకు ప్రభువురాత్రి భోజనము ఎంతో ప్రాముఖ్యమైనది.

జె.సి. ఛోట్

----0----


**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న**

**సత్యవాణి కార్యక్రమములను**

ప్రతి మంగళవారం ఉదయం 6:30 గంటలకు మాటివీలోను

శనివారం ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్‌లోను

గురువారం ఉదయం 7 గంటలకు విస్సా ఛానల్‌లోను చూడండి.

# పోరాడి జయమునొందిన సంఘము

(The Militant and Triumphant Church)

**పరిచయము:**

ప్రకటన 7వ అధ్యాయముచదువుము. "గొర్రెపిల్ల యొక్క ఉగ్రతమహాదినము వచ్చెను దానికి తాళజాలిన వాడెవడు?" అన్ను మాటతో 6వ అధ్యాయము ముగిసెను. 7వ అధ్యాయములో దానికి జవాబీయబడినది. ఈ అధ్యా యములో శ్రమలుగాకవిజయాన్ని మనంచూస్తాము.

ఈ అధ్యాయ ఆరంభములో "భూమి యొక్క నాలుగు దిక్కులలో నలుగురు దేవదూతలు నిలిచి యుండుట" చూస్తాము. వీరు భూమి యొక్క నాలుగు దిక్కులవాయువులను (గొలుసుతో కుక్కను వట్టుకొని యుండి నట్లు)పట్టుకొనియుండిరి. ఈ వాయువులు వినాశకర శక్తులు.దేవుడు తన చిత్తాన్ని జరిగించుట కొరకు తరుచు వాయువులను వినియోగిస్తారు,(యిర్మి 4:13;యోబు 37:9-10). ప్రకృతి శక్తులను దేవదూతలు కంట్రోలు చేయడం క్రొత్త యేమికాదు. దేవదూతలు అగ్నిని, నీటిని కంట్రోలు చేయుదురు (ప్రక 14:8; 16:5).

**I భూమి మీదనున్న క్రీస్తు సంఘము ముద్రింపబడినవారు** (4-5).

A.యెహెజ్కేలు 9:4-6;21:2-4 ను కూడచదువుము. ప్రకటన 7వ అధ్యాయములో వలెనే నొసళ్లమీద వేయబడిన ముద్రను గూర్చిప్రాథమికంగా ఆ లేఖన భాగములో కనబడును.

B.ముద్రవేయబడుట యాజమాన్యమును సూచించుచున్నది. యిది ఫలానా యజమాని సొత్తు అని ముద్ర వేయబడును.బైబిలుసందర్భముగాదేవుని ప్రజలు దేవునిసొత్తు అని ప్రత్యేకింపబడుటనుతెలియజేయుచున్నది.

C."జయించువానిని నా దేవుని ఆలయములో ఒక స్తంభముగా చేసెదను; ....మరియు నా దేవుని పేరును, పరలోకములో నా దేవుని యొద్ద నుండి దిగివచ్చుచున్న నూతనమైన

యెరుషలేమను నా దేవుని పట్టణపు పేరును, నా క్రొత్తపేరును వానిమీద వ్రాసెదను" అని ప్రకటన 3:12లో ప్రభువుసెలవిచ్చెను. ఆపేరు ఆయన ఎక్కడ వ్రాయునో ఇక్కడ తెలియజేయ బడలేదు.

D.ప్రకటన 14:1లో "మరియు నేనుచూడగా, ఇదిగో ఆగొర్రెపిల్ల సీయోను పర్వతము మీద నిలువబడి యుండెను. ఆయననామమును ఆయన తండ్రినామమును **నొసళ్ల యందు** లిఖింపబడియున్న మాట నలువది నాలుగువేలమందిఆయనతో కూడ ఉండిరి"యనివ్రాయబడియున్నది.

E.మరల ప్రకటన 22 అధ్యాయములోనికి వెళ్లితే పరలోకములో విమోచింపబడిన వారి దర్శనము కనుగొందుము. 3,4 వచనాల్లో "ఇకమీదట శాపగ్రస్తమైన దేదియు దానిలోఉండదు, దేవుని యొక్కయు గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును,ఆయన దాసులు ఆయన ముఖదర్శనముచేయుచుందురు; ఆయన నామమువారినొసళ్లయందుండును'' అని వ్రాయబడియున్నది.

F.దేవునియొక్కయుక్రీస్తుయొక్కయు నామమునొసటిమీద అలంకారరీతిగా ముద్రింపబడుట అనగా నీవు ఆయనకు చెందినవాడవని యర్థము. నీ స్వభావము (హృదయము)క్రీస్తుకు స్వాధీనము చేయబడినది. నీవుఆయన దాసుడవు. పాతనిబంధన కాలములో ప్రధానయాజకుడు "యెహోవా పరిశుద్ధుడు" లేక యెహోవాకు ప్రతిష్టితము" అని చెక్కబడిన (ముద్రవేయబడిన)మేలిమి బంగారు రేకును తన నొసట నిత్యము ధరించుకొనియుండేవాడు (నిర్గమ 28:36-38). అట్లే క్రొత్తనిబంధనలో ప్రతిక్రైస్తవుడు యాజకుడే గనుక మన నొసళ్లపై ఒక క్రొత్తపేరు, క్రీస్తుపేరు వ్రాయబడియున్నది. ప్రతిక్రైస్తవుడు ప్రభువుకు ప్రతిష్టితుడు.

G.మనము క్రీస్తుయొక్కస్వార్జితం. తన స్వరక్తమిచ్చి ఆయన మనలను కొన్నారు (అపొ.కా.20:28). మన జీవితాంతం వరుకు ఆయున కాపాడును. ఈ కావ్రుదల భౌతికహాని నుండిగాక సాతానుడు మనలను నాశనం చేయ కుండా ఆయనకాపాడును.

## II. "ముద్రింపబడినవారి లెక్క చెప్పగా వింటిని" (4-3)

A. పూర్వము బానిసలకు యజమానులు తమ ముద్రవేసేవారు. ఆముద్రను బట్టి బానిసయొక్క యజమానుడెవరో తెలిసేది. క్రైస్తవులు క్రీస్తుయొక్కయు, దేవునియొక్కయు దాసులు లేక బానిసలు. దేవుడు తనకు విధేయులైన వారికి పరిశుద్ధాత్మను అనుగ్రహించును (అపొ.కా. 5:32; 2:38). వారు "సత్యవాక్యమును అనగా రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మ చేతముద్రింపబడినవారు" (ఎఫెసీ 1:13).

B. నొసళ్లయందు ముద్రింపబడుట అలంకారభాషయే గాని దేవుడు ఎవరి నొసటిమీద పచ్చబొట్లు చెక్కించినట్లు భౌతికంగా ముద్రవేయరు. ఆయన సువార్త కు లోబడిన వాడు ఆయన కొరకు ముద్రింపబడిన వాడే.

C. "ఇశ్రాయేలు గోత్రము లన్నిటిలో ముద్రింప బడిన వారు లక్షనలువది నాలుగువేలమంది" (4వ). వారెవరు? వారు భూమిమీద నున్నక్రీస్తు సంఘము. సంఘము దేవుని ఇశ్రాయేలు అని తరుచు వర్ణించబడినది (గలతీ 6:16; రోమా 2:28-29).

ఈ నూట నలువదినాలుగు వేల మంది 9వ వచనములోచెప్పబడిన గొప్ప జనసమూహమే. 4-8 వచనాల్లో భూమిమీద పోరాడుచున్న సంఘము వర్ణించబడినది. మిగతా వచనాల్లో పరలోకంలో జయించిన సంఘము వర్ణించబడినది !

వారు గొర్రెపిల్లయైన క్రీస్తునువెంబడించినవారు, విమోచింపబడినవారు. దేవుని ప్రథమఫలము, మచ్చలేని వారు. వీరు భౌతిక ఇశ్రాయేలీయులు కాదుగాని క్రీస్తుకు విధేయులై ఆయన సేవచేయు సంఘము (14:4-5).

D. ప్రకటన 7:1-3లో శ్రమల నుండి ముద్రింపబడిన 144వేల మందిని చూస్తాము. ప్రక 7:14లో యున్న జనసమూహముమహాశ్రమల నుండి వచ్చినవారు. ఈరెండు సందర్భములలోను ఉన్నగుంపు ఒక్కటే -సంఘము 14:1లో ఆ 44వేలమంది దేవుని యెదుటనున్నట్లు కనుగొంటాము. వారు కూడ అదేజనసమూహము విమోచింపబడినవారు. గనుకసంఘము.

## III గొప్పజనసమూహము - పరలోకమందున్న సంఘము (9-17).

A. "మరియు నేనుచూడగా, ఇదిగో

ప్రతిజనములో నుండియు ప్రజలలో నుండియు,ప్రతివంశములోనుండియు, ఆయాభాషలు మాటలాడువారిలో నుండియు యెవడును లెక్కింపజాలని యొుక గొప్ప జనసమూహము కనబడెను."వారు గొఱ్ఱెపిల్లయెదుటను సింహాసనము ఎదుటను నిలువబడి స్తుతించుచుండిరి.

**B.** క్రీస్తుయిచ్చిన గొప్పసువార్త ఆజ్ఞఫలితము యిది. ఈ ప్రజలు సర్వ లోకము నుండి,సర్వసృష్టినుండివచ్చిన వారు (మత్త 28:18-20;మార్కు16:15-16;లూకా 24:47అపో.కా.1:8).

**C.** ఈ జనసమూహము సింహాసనము ఎదుటనిలువబడుటగమనించుము. యిది గొప్ప మహత్తర సంఘటన; సింహాసనము ఎదుటనిలబడుట !

**D.** వారుతెల్లని వస్త్రములు ధరించుకొనినవారు. సార్దీసులో జయించు వానికి తెల్లని వస్త్రములు వాగ్దానము చేయబడెను (ప్రక3:4-5). ఈ వస్త్రములు పరిశుద్ధుల నీతిక్రియలు (19:8). గొఱ్ఱెపిల్ల రక్తములో ఉతుకు కొనినందున అవి తెలుపు చేయబడెను (7:14). ఎవరి వస్త్రములు అట్లు ఉతుక బడెనో వారే పరలోకములో ప్రవేశించుటకు అర్హులు (22:14). తెల్లని వస్త్రములు పవిత్రతకు, విజయానికి, ఆనందానికి గురుతు.

**E.** ఈ జనసమూహము ఖర్జూరపు మట్టలు పట్టుకొనియుండిరి. పర్ణశాలల పండుగలో ఖర్జూరపు మట్టలు వినియోగించే వారు. యిది గొప్ప సంతోషముతో కూడిన పండుగ.యేసు జయోత్సవముతో యెరూషలేములో ప్రవేశించినప్పుడు యూదులు చెట్ల కొమ్మలను ఆయనదారి పొడవున పరచి, "దావీదు కుమారునికి జయము, ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడును గాక" అని సంతోషముతో కేకలువేసిరి (మత్తయి 21:6-9).

**F.** ఈ గొప్పజనసమూహమునిలువబడి సింహాసనాసీనుడైన మా దేవునికిని గొఱ్ఱెపిల్లకును మా రక్షణకై స్తోత్ర మని మహాశబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి (10వ). దేవదూతలందరును, నాలుగుజీవులును 24గురు పెద్దలును దేవుని ఆరాధించుట 11,12వచనాల్లో చూడగలము.

**G.** 13,14 వచనాల్లో ఆ పెద్దలలో ఒకనితో యోహాను సంభాషణయున్నది. ప్రకట 5:5లో యోహానును ధైర్యపరచిన

పెద్దయితడే కావచ్చును, తెల్లని వస్త్రములు ధరించుకొనిన వీరెవరు?

1. యోహాను చూచిన వారు మహాశ్రమలనుండి వచ్చినవారు, నిజానికి వచ్చుచుయున్నవారు అని చెప్పబడెను.

2. ఈ మహాశ్రమలు యేమిటి? అది క్రైస్తవజీవితమే.
అదిఒకే ఒకసారి జరిగేశ్రమకాలము కాదు. "లోకములో మీకు శ్రమకలుగును" అని క్రీస్తుచెప్పెను (యోహాను16:33). అనేక శ్రమలు అనుభవించి మనము దేవునిరాజ్యములో ప్రవేశింపవలెనని" క్రైస్తవులైనవారికి చెప్పబడినది (అపో.కా.14:22). "క్రీస్తుయేసునందు సద్భక్తితో బ్రదుక నుద్దేశించు వారందరు హింసపొందుదురు" (2తిమో3:12).

3. శ్రమలలోనుండి వచ్చినవారు గొర్రెపిల్ల రక్తములో తమ వస్త్రములను ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొనిరి(14వ). క్రీస్తురక్తము పాపములను కడిగివేయును(ప్రక1:6). బాప్తిస్మము పొందినప్పుడు మనపాపములు కడిగివేయబడును (అపో.కా.22:16). విశ్వసించి, మారుమనస్సుపొంది, క్రీస్తునామమును ఒప్పుకొని బాప్తిస్మముపొందిన వానిని ఆయన రక్తము హిమమువలె తెల్లగాచేయును (రోమా6:3-4).

4. 15-17వచనాల్లో, క్రైస్తవులై క్రైస్తవజీవితాన్ని జీవించుటలో కలిగే ప్రతిఫలాన్ని చూడగలము.

1. వారుదేవుని సింహాసనము ఎదుటవుందురు. దేవునితో పరిపూర్ణ సహవాసము కలిగియుందురు. (Perfect cmmunion).

2. రాత్రింబగళ్లు ఆయన ఆలయములో ఆయనను సేవించుదురు. ఇదిపరిపూర్ణ పరిచర్య (Perfect service).

3. దేవుడు తానే తన గుడారమును వారిమీద కప్పును. దేవుడు వారికి పరిపూర్ణ భద్రతనను గ్రహించును. (Perfect protection).

4. విమోచింపబడినవారికి ఇకమీదట ఆకలియైనను దాహమైనను ఉండదు. వారికి సూర్యునిఎండ, వడగాలి తగులదు. గొర్రెపిల్ల వారికికాపరియై జీవజలముల బుగ్గయొద్దకువారిని నడిపించును. యిదివారికి అనుగ్రహింపబడిన పరిపూర్ణ సంరక్షణ (Perfect provision).

**ముగింపు:**

దేవుడు తన వారిని ఎరుగును. దేవుని వెంబడించు వారు పవిత్రులు, గొర్రెపిల్లయైన క్రీస్తును వెంబడించు వారు అనింద్యులు, కపటములేనివారు. వారు అన్ని జనాంగములకు,భాషలకు, సంస్కృతులకు చెందినవారు. పరలోక చిత్రాన్ని యోహాను ఈ అధ్యాయంలో అతిమనోహరముగా మాటలతో మనకు చిత్రీకరించాడు. రక్షింపబడిన వారు నీతిక్రియలను తెల్లని వస్త్రములు ధరించుకొని ఎల్లవేళలా సంతోషముతో యుంటారు. పరలోకమందలి దూతలతోను, పరిశుద్ధులతోను ఏకమైవారు దేవుని,క్రీస్తును నిరంతరము ఆరాధిస్తారు. అన్ని యుగాలలో యున్న రక్షింపబడినవారందరు దేవుని సముఖమున యుండగా దేవుడువారి ప్రతి అవసరమును తీర్చును !


సత్యవాణి – క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

# క్రీస్తు సంఘము, మతశాఖలు

## (The Church and the Denominations)

క్రీస్తు సంఘమునకును వివిధ మతశాఖలకును యున్న వ్యత్యాసమేమి? ఈ వ్యాసములో ఆధునిక మతశాఖలను గూర్చి క్లుప్తముగా తెలిసికొందాము.

• తాను వాగ్దానము చేసిన రీతిగా యేసుక్రీస్తు మరణించి, సమాధిచేయ బడి పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకొస్తునాడు తన సంఘమును స్థాపించెను (మత్తయి 16:18; అపొ.కా. 2).

• క్రొత్తనిబంధన కాలములో ఒకేఒక్క సంఘముండెను. ప్రతిక్రైస్తవుడు దానిలో సభ్యుడైయుండెను.

• ఆ నాటి ఆదిమ క్రైస్తవుల విశ్వాసమునకు, ఆచరణకు యున్న ఏకైక మార్గదర్శి దేవునివాక్యమే (2యోహాను :9; 1 పేతురు 4:11; 2 తిమో 3:16-17).

క్రీస్తు యొక్క సంఘము మతశాఖకాదని గమనించుము.

• ఆదిమ నమూనా నుండి, విశ్వాసము నుండి ప్రజలుతొలగి పోవుదురని ప్రభువు ముందుగానే హెచ్చరించెను. అట్లే విశ్వాస భ్రష్టత్వము సంభవించెను (I తిమో 4:1; 2 తిమోతి 4:3,4; అపొ.కా. 20:29,30; 2 థెస్స 2:3).

• రోమన్ కేథలిక్కు సంఘము అను ఒక సంస్థ ఆదిమ విశ్వాసమునుండి తొలగి పోయిన వారివలన ఉద్భవించెను. అదిక్రీస్తు తన సంఘమును స్థాపించిన కొన్ని శతాబ్దములకు ఆరంభించెను.

• రోమన్ కేథలిక్కు సంఘమును సవరించుటకుగాను ప్రొటెస్టాంటుల మొదటి డినామిషన్ ఆరంభమాయెను.

• కేథలిక్కుల తప్పుడు పద్ధతులను కొన్ని వారు సవరించినను ప్రొటెస్టాంటులు అనేక యితర తప్పుడు పద్ధతులను ప్రవేశపెట్టిరి. అవేవనగా :

- వందలాది శాఖలు
- లేఖన విరుద్ధమైన నామములు
- లేఖన విరుద్ధ బోధలు
- లేఖన విరుద్ధ పాలనపద్ధతులు
- లేఖన విరుద్ధ ఆరాధన
- రక్షణ సంకల్పమును సత్యవాక్య ప్రకారము బోధించకపోవుట.

ప్రజలు మతశాఖల పద్ధతులను విసర్జించి క్రొత్తనిబంధన విశ్వాసమును, ఆచరణను అనుసరించుటకు నిశ్చయించుకొన్న చోట క్రీస్తుసంఘములు నేడున్నాయి. బైబిలు సంకల్పముకు భిన్నముగా యున్న ప్రతిపద్ధతికి మేము విరోధము, నిజసంఘము మతశాఖ కాదు. దానిని ఎరుగనివారు అదొక మతశాఖయని తలంతురు. ప్రజలు లేఖన విరుద్ధ సంగతులను మానవ కల్పితశాఖలను విసర్జించి బైబిలు మార్గములో ప్రవేశించాలని వారిని గూర్చి నిరంతరము ప్రయత్నించాలి.

ప్రజల హృదయాలను, ఉద్దేశాలను ప్రశ్నించుట మాపనికాదుగాని ఏయే బోధలు,పద్ధతులు, ఆచారాలు లేఖన విరుద్ధములో మనం తెలిసికోగలము. వాటిని దేవుని వాక్యముతో పోల్చి చూడగా అవి వాక్యవిరుద్ధములని గ్రహించగలము. దేవునివాక్యానికి విరుద్ధమైనవి దేవునికి విరుద్ధమైనవే ! గలతీ 1:6-9 చూడుము.

ప్రజలు డినామినేషన్లకు అలవాటు పడిపోయినందున, అవి నిజ క్రైస్తవ్యానికి భిన్నమైనవని వారు గ్రహించుకొనుట కష్టము. అందువలన క్రీస్తుసంఘము కూడ ఇంకొక మతశాఖయని వారు భావిస్తారు, గాని :

- సంఘమును క్రీస్తు స్థాపించెను (మత్తయి 16:18)
- అదొక డినామినేషన్ కాదు.
- అది కేథలిక్కులదిగాని, ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు.
- దాని ఏకైక విశ్వాస ప్రమాణము బైబిలు మాత్రమే.
- దాని ఆచారపద్ధతులు అన్ని బైబిలును బట్టియే యుండును.
- మానవ పద్ధతులనుగాక బైబిలును మాత్రమే ప్రజలు ఎక్కడ అనుసరించినా అక్కడ క్రీస్తుసంఘ ముండును.

– డేవిడ్ ఫార్

# సంఘమును పునరుద్ధరించుట
## (Restoring the Church)

ఫ్రాన్స్ దేశములో యున్న సూలేక్ అనే గ్రామములో రైతు ఒకడు పాతిపెట్టబడి యున్న కర్రను కనుగొనెను. దానిని త్రవ్విలాగడానికి అతడు ప్రయత్నము చేయగా భూమి లోపల లోతుగా పాతిపెట్టబడి యున్న మరియొక దానికి అది చేర్చబడెనని గ్రహించెను. దానిని బయటికిలాగడానికి యితరులుకూడ సహాయంచేయ పూనుకొన్నారు. అది పురాతన ఆలయము యొక్క ధ్వజస్థంభమని వారు తెలుసుకొని ఆశ్చర్యపడ్డారు. శతాబ్ధముల తరబడి సంభవించిన తుఫానుల వలన భూకంపముల వలన ఆ చర్చ్ బిల్డింగ్ భూమిలో కూరుకుపోయింది. దాన్ని అందరూ మరచిపోయారు. అయితే ఆ గ్రామస్థులు కూరుకుపోయిన బిల్డింగ్‌ను అంతా బయటకు త్రవ్వి దాన్ని పునరుద్ధరించారు.

ఈ సంఘటన నేటిమత ప్రపంచానికి అత్యంత అవుసరముగా యున్న దానిని సూచించుచున్నది. 2000 సంవత్సరముల క్రితము యేసుక్రీస్తు ఈలోకానికి వచ్చి చనిపోయి తన సంఘాన్ని స్థాపించారు. (అపొ.కా. 20:28; మత్తయి16:18). అయితే శతాబ్ధములు గడచుకొలది క్రీస్తు సంఘము మానవ కల్పిత బోధలు, సిద్ధాంతములు, ఆచారముల వలన కూరుకుపోయింది (I తిమో 4:1-7)

21వ శతాబ్ధములో క్రైస్తవ్యము ముందుకు సాగాలంటే అదివెనుకకు వెళ్లాలి. అది మొదటిశతాబ్ధపు క్రీస్తు సంఘమునకు, క్రొత్తనిబంధనకు వెనుకకు వెళ్లాలి. యేసుక్రీస్తు స్థాపించిన సంఘాన్ని కనుగొనుట కొరకు నేటిమతశాఖల ప్రపంచమును త్రవ్వి సత్యమును వెలికితీయాలి. మనం క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించాలి. బైబిలునొద్దకు మరలాలి !

– బాబీ డోక్రి

# మట్టి మాట్లాగలిగితే
## ( If Dirt Could Talk)

ప్రభువుచెప్పిన విత్తువాని ఉపమానము, ఆయానేలల ఉపమానమని కూడా పిలువబడింది (మత్తయి 13:1; మార్కు 14:1; లూకా 8:1). ఈ నేలలు నాలుగురకములైన హృదయాలను సూచించును.

**త్రోవ ప్రక్కన పడిన హృదయము:**

ఇట్టి హృదయము దేవుని వాక్యానికి, ఆయన చిత్తానికీ గొప్ప ఉదాసీనత చూపించును, గర్వము, సంశయము, ఉదాసీనతల వలన విత్తబడిన వాక్యము ఇట్టివాని హృదయములో నుండి అపవాది ఎత్తుకొని పోవును. త్రోవ ప్రక్కన పడిన నేలవంటి హృదయము దేవుని గూర్చి తప్ప అన్నింటిని గూర్చి మాట్లాడును. ఆత్మీయ విషయాల్లో అతని హృదయంలో దేవునికి తావేలేదు. అందువలన అతనికి పరలోకంలో స్థానం వుండదు.

**ముండ్ల పొదల నడుమ హృదయము:**

ఇట్టి హృదయములో దేవుని వాక్యం త్వరలో మొలకెత్తును గాని ఏమాత్రం శోధనలు వచ్చిన, హింస కలిగినా అది త్వరలో వాడిపోవును. కొంత కాలము తొలగిపోవును (లూకా 8:13). ఇట్టి హృదయములో ఆత్మీయత -లోతుగా వుండదు. యిట్టి హృదయంలో పడిన వాక్యానికి బలం వుండదు, వేళ్ళు నాటుకొనవు, అందువలన వాడిపోవును, ఎండిపోవును.

**రాతినేలను పోలిన హృదయం:**

ఈ హృదయం బాధ్యతలను గూర్చి, విధులను గూర్చి, చేయవలసిన పనులను గూర్చి అస్తమానము మాట్లాడును. ఈ హృదయం ఐహిక విచారములను గూర్చి, ధన భోగముల గూర్చి తరుచు మాట్లాడును. అందువలన పరిపక్వముగా ఫలింపదు (లూకా 8:14). ఇట్టి హృదయం " ఆ పని ఇంకొకరికి చెప్పు; నేను చాల బిజీగా యున్నాను, దేవుని పనికి నాకు సమయంలేదు" అని చెప్పును.

**యోగ్యమైన మంచి మనస్సు**

ఈ హృదయం ఈ లోకంలో యున్న అందమైన పాఠాన్ని బోధించును; "మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడునని" అది బోధించును (మత్త 6:3). ఎంత మంచి వర్తమానమో! ఏమి ప్రకటయో! ఈ గొప్ప పాఠాన్ని మన హృదయాలు బోధిస్తూ ఓపికతో ఫలములు ఫలించుదుము గాక! (లూకా 8:15).

మన హృదయాలు మాట్లాడును, మన జీవితాలు మానవులకు దేవునికీ బాహాటముగా ఎరుకయే. దేవుని మహిమ కొరకు మన హృదయాలు మంచి ఫలములు ఫలించే నేలకావాలి. "యెహోవా, నా ఆశ్రయదుర్గమా, నా విమోచకూడా, నానోటి మాటలును నాహృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగుగాక" (కీర్త 19:14).

# సత్యవాణి సంగీతమాలిక
# Vol 5 and 6
## ఇప్పుడు లభించుచున్నవి.

మీరు సత్యవాణి రేడియో, T.V కార్యక్రమములలో వినుచున్న ఆహ్లాదకరమైన పాటల కేసెట్లు మొత్తం 6 వాల్యూమ్స్ లభించుచున్నవి. ఆరు కేసెట్లులోను 72 పాతక్రొత్త పాటలు చక్కటి సాంకేతిక పరిజ్ఞానంతో మంచి గాయనీయకులతో రికార్డు చేయబడినవి. ఆరు కేసెట్లుకు 200/-రూ॥లు మాకు పంపవలెను. లేదా 2 కేసెట్లు చొప్పున 65/- రూ॥లు మాకు పంపిచాలి. మీ MO అందగానే మీకు కేసెట్లును గాని CD లను గాని అందజేయగలము.

సత్యవాణి
7-9-35, సాంబమూర్తివీధి,
కాకినాడ - 533 004.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 0